సాక్షి పెద్దపల్లి

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

మీటరు పంపిణీ పథకం ప్రారంభం

రామగుండం: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన చౌక ధరకు విద్యుత్ మీటరు పథకాన్ని అంతర్గాం ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ శుక్రవారం ప్రారంభించారు. 500 వాట్స్ సామర్థ్యం వినియోగించుకునే వారికి రూ.938లకే విద్యుత్ మీటరు అందిస్తున్నామని, ఈనెల 15వ తేదీలోగా కొత్త గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 17వ తేదీ నుంచి ప్రజాపాలనలో నూతన విద్యుత్ మీటరు పొందిన వివరాలను సమర్పిస్తే గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామని ఆయన వివరించారు. ఏడీఈ రాజ్‌కుమార్, ఏఈలు ఆశ శంకర్, బేతి దామోదర్‌రావు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. తన కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పంచాయతీరాజ్ అధికారులు పర్యటించి అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

పండుగలు ప్రకృతి హితంగా ఉండాలి



విగ్రహాలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్లు

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరు మట్టిగణపతిని పూజించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ కోరారు. రామగుండం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శుక్రవారం ఆయన మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రకృతి హితమే పండుగ పరమార్థమన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ భిక్షపతి, ఏఈ వీరేశ్, అధికారులు పాల్గొన్నారు.

'మట్టి గణపతులనే పూజిద్దాం'



విగ్రహాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ మమత

పెద్దపల్లిరూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమత అన్నారు. బల్దియా ఆధ్వర్యంలో స్థానిక మినీ ట్యాంకుబండ్(ఎల్లమ్మ చెరువు)పై శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతీఒక్కరు మట్టి గణపతులను పూజించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'ఎల్లంపల్లి' గేట్లు మూసివేత



ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరడంతో గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేసిన నీటిపారుదల శాఖ అధికారులు.. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో శుక్రవారం గేట్లు మూసివేశారు. సాయంత్రం ఐదు గంటలకు అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 19.14 టీఎంసీలకు చేరింది. 38,913 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఔట్‌ఫ్లో 302 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం అన్ని గేట్లు మూసివేశారు.

అనుమతి తప్పనిసరి

రామగిరి(మంథని): వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని గోదావరిఖని ఏసీపీ రమేశ్ సూచించారు. ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. సెంటనరీకాలనీ సీఎస్పీవోఏ క్లబ్‌లో వినాయక మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. అన్నిమతాలను గౌరవిస్తూ ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. మంథని సీఐ రాజు, ఎస్సై చంద్రకుమార్, ఆర్ఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీకి మరో అవార్డు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ మరో అవార్డుకు ఎంపికైంది. క్లీన్ ఎనర్జీ మినిస్టీరియల్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఇన్‌సైట్ అవార్డుకు ఎంపికైనట్లు అధికారులు శుక్రవారం వివరించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు నేతృత్వంలో ప్రతిష్టాత్మక ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఇన్‌సైట్ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. 2024 ఎనర్జీ మేనేజ్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డ్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో సంస్థ ఆదర్శప్రాయమైన ప్రయత్నాలను ప్రదర్శించిందన్నారు. సమర్థవంతమైన వనరుల నిర్వహణ, స్థిరమైన ఇంధన పొదుపు, శక్తి పనితీరులో నిరంతర మెరుగుదల అవార్డుకు ఎంపికయ్యేందుకు దోహదం చేశాయని పేర్కొన్నారు.

పల్లెకు అక్షర కాంతి

- నిరక్షరాస్యులను గుర్తించేందుకు సర్వే
- వయోజనుల కోసం 'ఎన్ఐఎల్‌పీ'
- గతంలో సర్వేలతోనే సరిపెట్టిన వైనం
- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం
- ఈసారైనా పక్కాగా అమలు చేయాలని డిమాండ్



ఓ గ్రామంలో చదువుకుంటున్న వయోజనులు (ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: అభివృద్ధిపై అక్షరాస్యత ప్రభావం చూపుతుంది. నిరక్షరాస్యులు అధికంగా ఉండే ప్రాంతాలు సహజంగా ప్రగతిలో వెనుకబడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి గ్రామాల్లోనే అధికంగా కనిపిస్తోంది. అందుకే పల్లెల్లో అక్షర కాంతులు నింపాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం తాజాగా న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం(ఎన్ఐఎల్‌పీ)కు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 15ఏళ్ల పైబడిన వయోజనులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనుంది. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. వివిధ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు, యువత, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో వయోజనులకు చదువు నేర్పించనున్నారు. ఇందుకయ్యే ఖర్చు కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40లో బడ్జెట్ కేటాయిస్తాయి. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో సర్వే కొనసాగుతున్నా.. బడ్జెట్ కేటాయించక మన జిల్లాలో సర్వే ఇంకా ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు.

మహిళలలే అధికం..

- నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించింది.
- చివరగా సాక్షరభారత్ కార్యక్రమం చేపట్టిన అక్షరాస్యత కొంత పెంచారు.
- ఆ తర్వాత పాఠశాల విద్యార్థులతో తల్లిదండ్రులకు చదువు చెప్పించే కార్యక్రమం ప్రారంభించారు.
- కానీ, ఆశించిన మేర ఆ కార్యక్రమం ఫలితాలు ఇవ్వలేదు.

జిల్లా సమాచారం

గ్రామపంచాయతీలు	267
జనాభా	7,95,332
అక్షరాస్యత(శాతం)	60.02
గుర్తించిన నిరక్షరాస్యులు	3,17,971

- ఈక్రమంలోనే 'ఈచ్ వన్.. టీచ్ వన్' అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- పల్లె, పట్టణ ప్రగతి నిరక్షరాస్యుల వివరాలు సేకరించింది.
- మన జిల్లా జనాభా 7,95,332 ఉండగా అందులో 3,17,964 మంది నిరక్షరాస్యులు ఉన్నారని అధికారులు గుర్తించారు.
- ఇందులోని పురుషులు 7,547మందికి, మహిళల్లో 11,321 మందికి చదవు చెప్పించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు.
- అయితే, కరోనాతో మర్గాదర్శకాలు విడుదలకాకపోవడంతో అప్పుడు సర్వేలతోనే సరిపెట్టారు.

గతంలో ఈచ్‌వన్ టీచ్‌వన్...

2020 ఫిబ్రవరిలో రాష్ట్రప్రభుత్వం పల్లె, పట్టణప్రగతి కార్యక్రమంలో సర్వే నిర్వహించి వివరాలు సేకరించింది. విద్యావంతులే చదువురాని కుటుంబ సభ్యులకు తమ ఇళ్లలో 'ఈచ్ వన్.. టీచ్ వన్' పద్ధతిలో చదువు చెప్పించి, నిర్దేశిత గడువులోగా అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని, లేదా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఒక్కోవార్డులో నిరక్షరాస్యుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక విద్యాబోధన కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించింది. లేదా వయోజన విద్యా కేంద్రాలనైనా తెరిపించాలని యోచించింది. ఈమూడు ప్రక్రియల్లో ఏదోఒకటి అమలు చేయాలని నిరక్షరాస్యుల గుర్తింపు సర్వేకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. తర్వాత మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అక్షరాస్యతను పెంచే దిశగా సాక్షర భారత్ స్థానంలో 'పఢ్‌నా.. లిఖ్‌నా.. అభియాన్' అములు చేసేందుకు గతంలో కేంద్రప్రభుత్వం వివరాలు సేకరించింది. అక్షరాలు చదవడం రాయడం రాని వారి పేర్లు, వయసు, ఆధార్ సంఖ్య, మాతృభాష, మొబైల్ నంబర్ తదితర వివరాలతో పంచాయతీరాజ్ శాఖ వెబ్‌సైట్‌లో కార్యదర్శి లాగిన్‌తో అప్‌లోడ్ చేశారు. అక్షరాస్యులుగా మార్చే బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించారు. బీఈడీ, డీఈడీ, పాఠశాల విద్యార్థులను వలంటీర్లుగా నియమించి అక్షరాలు దిద్దించాలనుకుంది. అయితే, కరోనా మహమ్మారితో ఆ ప్రక్రియకు ముందడుగు పడలేదు. తాజాగా కేంద్రప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారా పల్లెల్లో అక్షరకాంతులు నింపేదుకు శ్రీకారం చుట్టింది.

ఎట్టకేలకు లారీ టెండర్లు ఖరారు

- ఇరువర్గాల రాజీతో సమస్య పరిష్కారం

సాక్షి, పెద్దపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేందుకు నిర్వహించిన టెండర్ల వివాదం ఇరువర్గాల రాజీతో ఎట్టకేలకు సద్దుమణిగింది. వివరాలు.. జిల్లాలో వచ్చే వానాకాలం, యాసంగిలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలు అవసరమని అధికారులు ప్రణాళిక రూపొందించారు. వీటిని కేటాయించేందుకు సివిల్ సప్లయి శాఖ జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని, సుల్తానాబాద్ సెక్టార్లలో టెండర్లు ఆహ్వానించింది. గురువారం సాయంత్రం 4గంటల వరకు టెండర్ల దాఖలుకు గడువిచ్చింది. ఈ నేపథ్యంలో పెద్దపల్లికి సన్‌రైజర్ ట్రాన్స్‌పోర్ట్, సుల్తానాబాద్‌కు ఎస్ఆర్, రామసేతుల ఎంటర్ ప్రైజెస్‌లు రెండు టెండర్లు, మంథనికి సయ్యద్ అండ్ సన్స్, శ్రీవిజయదుర్గ ట్రాన్స్‌పోర్టు రెండు టెండర్లు, రామగుండానికి రామగుండం లారీ అసోసియేషన్లు టెండర్లు దాఖలు చేశాయి. అయితే, రామగుండం సెక్టార్‌కు కాటారానికి చెందిన సాయిరాం ట్రాన్స్‌పోర్టు సైతం టెండర్లు దాఖలు చేసేందుకు డీఎం కార్యాలయానికి చేరుకుంది. ఈక్రమంలో రామగుండం లారీ అసోసియేషన్ ప్రతినిధులు టెండర్ పత్రాలు తీసుకుని పరారాయ్యారు. దీంతో సదరు కాంట్రాక్టర్స్‌కు శుక్రవారం 11 గంటల వరకు టెండర్ దాఖలు చేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అయితే, తెరవెనుక ఒక ప్రజాప్రతినిధి, ఓ ఉన్నాతాధికారి సదరు లారీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి రాజీకుదిర్చినట్లు సమాచారం. దీంతో లారీల టెండరు వివాదం సద్దుమణిగింది. ఇదే విషయమై అదనపు కలెక్టర్ శ్యాంలాల్ ప్రసాద్ వివరణ కోరగా రామగుండం సెక్టార్‌కు టెండర్ దాఖలు చేయడానికి సమయం ఇచ్చినా.. ఎవరూ దాఖలు చేయలేదన్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్లు, అసోసియేషన్ పెద్దల సమక్షంలో కుర్చుని సమస్య పరిష్కారం కోసం రాజీపడుతున్నామని తమకు లేఖ ఇచ్చారని తెలిపారు. దీంతో దాఖలై టెండర్లలో నిబంధనల ప్రకారం తక్కువగా కోట్‌చేసిన వారికి ఖరారు చేసినట్లు వివరించారు. ఒకటే టెండర్ దాఖలైన పెద్దపల్లి సెక్టార్‌కు సన్‌రైజ్ ట్రాన్స్‌పోర్ట్‌ను, రామగుండానికి రామగుండం లారీ అసోసియేషన్‌కు, తక్కువగా కోట్ చేసిన రామసేతు ఎంటర్ ప్రైజెస్‌కు సుల్తానాబాద్, మంథని సెక్టార్‌కు సయ్యద్ అండ్ సన్స్‌కు టెండర్లు ఖరారు చేసి, అధికారులు ప్రతిపాదనలను కమిషనర్‌కు పంపించామని ఆయన వెల్లడించారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 91మంది లబ్ధిదారులకు రూ.91.56 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీమహిళ ఆత్మగౌరవంతో జీవించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్‌కార్డు అందించలేదన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డు అందించేలా కృషి చేస్తున్నారని తెలిపారు. సబ్బండ వర్గాలకు మేలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కాంగ్రెస్ చేసే మంచి పనులను ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలకు తెరలేపాయని విమర్శించారు. వారికి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, తహసీల్దార్ కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మహిళలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభం

పెద్దపల్లిరూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఇందిరా మహిళా శక్తి(మెప్మా) ద్వారా 21 వార్డు స్వశక్తి సంఘం సభ్యురాలు పల్లెర్ల సౌజన్య రూ.4.5 లక్షల వ్యయంతో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మొబైల్ టిఫిన్ సెంటర్‌ను అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమినర్ మల్లికార్జునస్వామి, సుల్తానాబాద్ మేనేజరు ఆలీం, కౌన్సిలర్ గాదె మాధవి, మెప్మా ఏడీఎంసీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సేవలపై అవగాహన కల్పించాలి

సఖి వన్ స్టాప్ కేంద్రాల ద్వారా అందించే సేవలపై మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి స్థానిక సఖి వన్ స్టాఫ్, భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా సఖి కేంద్రం అందిస్తున్న సేవలకు ప్రచారం కల్పించాలన్నారు. ప్రతీ మహిళకు సఖి కేంద్రంపై అవగాహన వచ్చేలా కృషి చేయలన్నారు. సఖి కేంద్రంలోని లీగల్ కౌన్సెలర్‌లకు మంచి నైపుణ్యం కలిగిన లీగల్ అడ్వైజర్లతో శిక్షణ ఇప్పించాలన్నారు. భరోసా సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్.. పోక్సో, లైంగికదాడుల కేసులపై ఆరా తీశారు. జిల్లా జడ్జితో మాట్లాడి సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్‌ఖాన్, సఖి సెంటర్ కో ఆర్డినేటర్ స్వప్న, భరోసా లీగల్ అడ్వైజర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

డీపీవోగా బాధ్యతల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లా పంచాయతీ అధికారిగా వీరబుచ్చయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్లలో పనిచేస్తున్న డీపీవో వీరబుచ్చయ్య పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆశాలత ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈమేరకు రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వీరబుచ్చయ్య సుల్తానాబాద్ మండలం మంచరామి నివాసి. ఇది వరకు పెద్దపల్లి బీడీవో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

ప్రశాంతంగా ఉత్సవాలు

పెద్దపల్లిరూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ కృష్ణ సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు, మతపెద్దలతో శుక్రవారం జిల్లా కేంద్రంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా నవరాత్రులను జరుపుకోవాలన్నారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: డ్రైవర్లు మాదక ద్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఆర్‌టీవో రంగారావు అన్నారు. ఎక్సైజ్ శాఖ సమన్వయంతో డ్రైవర్లకు జిల్లా కేంద్రంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాల గురించి ఆయన వివరించారు.

సింగరేణి పరిరక్షణకు ఐక్య పోరాటం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ కోరారు. శుక్రవారం స్థానిక శ్రామికభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో భవిష్యత్‌లో సింగరేణికి బొగ్గు బ్లాకులు దక్కవని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్రప్రభుత్వం వేలం పాట విధానం తీసుకువచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో బొగ్గు బ్లాకుల కోస సింగరేణి సంస్థ అన్వేషణ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో బొగ్గు తవ్వే హక్కు సింగరేణికే ఉండాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు ముప్పు వస్తే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రమాదంలో పడుతుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టి సింగరేణికి బొగ్గు బ్లాకులు సాధించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు ఎ.ముత్యంరావు, మహేశ్వరి, ఎం.రమాచారి, వి.కుమారస్వామి, జి.జ్యోతి, మెండె శ్రీనివాస్, ఎస్.రవీందర్, అశోక్, గణేశ్ పాల్గొన్నారు.

నేర చట్టాలను రద్దు చేయాలి

- ఐఎఫ్‌టీయూ నేత టి.శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని: నాలుగు లేబర్‌కోడ్‌లు, మూడు నేరచట్టాలను ప్రభుత్వం రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్, మూడు నేర చట్టాలు కార్మిక వర్గానికి ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించని దౌర్భాగ్య పరిస్థితి నేడు ఉందన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయకుండా అడ్డుకోవడం కోసమే నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈక్రమంలో ఈనెల 8న మార్కండేయ కాలనీలో జరిగే ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, బి.అశోక్, శంకర్ పాల్గొన్నారు.

వర్షాలను అధిగమిస్తూ..

- నిర్దేశిత లక్ష్యం వైపు సింగరేణి అడుగులు
- ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తిపై కొంత ప్రభావం
- ఇప్పటివరకు 24.70 మిలియన్ టన్నుల సాధన

బొగ్గు ఉత్పత్తి సమాచారం

వార్షిక లక్ష్యం(మిలియన్ టన్నుల్లో)	72
ఆగస్టు నాటికి(మిలియన్ టన్నుల్లో)	26.38
ఇప్పటివరకు సాధించిన ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)	24.70
ఇప్పటివరకు సాధించిన బొగ్గు ఉత్పత్తి(శాతంలో)	94

ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి(లక్షల టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ–1	19.47	17.00	87
ఆర్జీ–2	27.11	34.04	126
ఆర్జీ–3	24.52	23.49	96
ఏపీఏ	3.12	2.96	95
భూపాలపల్లి	15.45	10.64	69
కొత్తగూడెం	55.07	51.70	94
ఇల్లెందు	14.39	16.75	116
మణుగూరు	49.88	46.49	93
బెల్లంపల్లి	14.50	13.32	92
మందమర్రి	15.21	12.24	80
శ్రీరాంపూర్	25.15	18.35	73



ఓసీపీలో బొగ్గు వెలికితీస్తున్న షావల్

గోదావరిఖని: భారీ వర్షాలు కురుస్తున్నా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించే దిశగా సింగరేణి సంస్థ ముందుకు సాగుతోంది. గడిచిన రెండు నెలల్లో ఉత్పత్తి కొంత మేర తగ్గినా.. నిర్దేశిత లక్ష్య సాధనలో 94 శాతం నమోదు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. గత ఐదునెలల్లో 26.38 మిలియన్ టన్నులకు 24.70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించింది. గతనెలలో 96 శాతం నమోదు చేయగా, ఈసారి రెండు శాతం తగ్గి 94 శాతం వద్ద నిలిచింది. ప్రధానంగా ఓసీపీల ద్వారా సంస్థలో 80శాతం వరకు బొగ్గు ఉత్పత్తి అవుతోంది. రెండు నెలలుగా వర్షాలు కురుస్తుండటంతో ఉత్పత్తి లక్ష్యంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. భారీ వర్షాలతో ఓసీపీల్లోని హాలేజీ రోడ్డు పాడైపోవడం, క్వారీలోకి నీళ్లు చేరడంతో తరచూ ఉత్పత్తి నిలిచిపోతోంది. దీంతో ఓసీపీల్లో ఉత్పత్తి కొంత మేర తగ్గింది. సంస్థలోని మొత్తం 11 ఏరియాలు ఉత్పత్తిలో పోటీ పడుతున్నా.. మూడు ఏరియాలు లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నాయి. ఉత్పత్తిలో పోటీ పడుతున్నా బొగ్గు పొరలపై ఉన్న ఓవర్ బర్డెన్(ఓబీ) వెలికితీతలో వెనకపడిపోయాయి. అయినా వర్షాలు తగ్గిన తర్వాత దూకుడుగా సాగి వార్షిక లక్ష్యం సాధిస్తామని యాజమాన్యం ధీమాగా చెబుతోంది.

ముందంజలో మూడు ఏరియాలు

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో గత ఐదు నెలల్లో మూడు ఏరియాలు ముందంజలో ఉన్నాయి. ఆర్జీ–2 ఏరియా 126శాతం ఉత్పత్తి సాధించి ముందంజలో ఉండగా, ఇల్లెందు ఏరియా 116శాతంతో రెండోస్థానంలో నిలిచింది. భూపాలపల్లి ఏరియా 69శాతం ఉత్పత్తితో చివరి స్థానంలో నిలిచింది. ఉత్పత్తి లక్ష్యం సాధించే దిశగా సంస్థ సీఎండీ బలరాం ఏరియా వారీగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నారు.

క్రీడా ప్రాంగణమే కానీ..



గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఊరుకో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. ఇందుకోసం నిధులు కూడా మంజూరు చేసింది. కానీ, కొన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 'తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం' అనే బోర్డులు తగిలించి మమ అనిపించారు. రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆట స్థలంలోనూ ఇలాగే ఓ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు.. ఇందుకోసం మంజూరైన నిధులు, పరికరాల సంగతి గురించి వెల్లడిస్తే బాగుంటుందని గ్రామస్తులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

9న అప్రెంటిస్ మేళా

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 9న ప్రధానమంత్రి అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మేళా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మిషనిస్ట్, డీజిల్ మెకానిక్, మోటర్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, కొపా ట్రేడ్ పూర్తిచేసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుకోవాలన్నారు. హార్డ్‌కాపీలతో మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు మల్లికార్జున్, దత్తాద్రి, ఫోన్ నంబర్లు 99896 16132, 90524 87596లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


పద్మ (ఫైల్)


ముత్తారం(మంథని): పోతారంలో శుక్రవారం రాత్రి చింతల పద్మ(37) విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పొద్దంతా కూలీపని నుంచి ఇంటికి వచ్చాక స్నానం కోసం వాటర్ హీటర్ పెట్టింది. నీటి వేడిని పరిశీలించబోయిన పద్మ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాకు తగిలి కిందపడిపోయింది. అపాస్మరకస్థితిలోకి వెళ్లిన పద్మను భర్త మొగిలి చూసి వెంటనే పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించాడు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. మృతురాలికి ఒక కూతురు ఉంది.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

ధర్మపురి: షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధమైన ఘటన ధర్మపురి మండలంలోని నేరెళ్లలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నేరెళ్లకు చెందిన నూకల సత్తవ్వ కుటుంబసభ్యులు గురువారం రాత్రి ఇంట్లో కూలర్ వేసుకొని, నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక కూలర్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికి మెలకువ రావడంతో కుటుంబసభ్యులందరూ భయాందోళనకు గురై, బయటకు పరుగులు తీశారు. అప్పటికే మంటలు వ్యాపించి, ఇంట్లోని మంచాలు, టీవీ, దుస్తులు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.8 వేలతోపాటు 25 కిలోల బియ్యం అందజేశారు.

లలిత గీతాల కవి ఇకలేరు

- అనారోగ్యంతో సినారె శిష్యుడు వడ్డేపల్లి కృష్ణ కన్నుమూత
- బహుముఖ సాహితీ ప్రక్రియల్లో దిట్ట
- సినీ గీత రచయిత, దర్శకుడిగా గుర్తింపు
- సిరిసిల్ల చేనేత కుటుంబంలో జననం
- ఐదు దశాబ్దాలపాటు సాహితీ సేద్యం


కృష్ణ (ఫైల్)

సిరిసిల్ల కల్చరల్: లలిత గీతాల రచనతో జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ కవి వడ్డేపెల్లి కృష్ణ(76) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. సిరిసిల్ల చేనేత కుటుంబంలో పుట్టి హైదరాబాద్ నాగోల్‌లో స్థిరపడ్డారు. సి.నారాయణరెడ్డి(సినారె) శిష్యుడిగా కవితా వ్యాసంగంలో కాలుమోపిన ఆయన పలు సాహితీ ప్రక్రియల్లో రాణించి, ఐదు దశాబ్దాల పాటు నిరంతర సాహితీ సేద్యం చేశారు.

పోస్టల్ శాఖలో గుమాస్తాగా చేరి..

నేత కార్మిక కుటుంబానికి చెందిన వడ్డేపెల్లి లింగయ్య-లక్ష్మమ్మ దంపతులకు 30 జూలై, 1949లో కృష్ణ జన్మించారు. డాక్టర్ కావాలనుకున్నా ఆయన ఆర్థిక ఇబ్బందులతో కాలేకపోయారు. పోస్టల్ శాఖలో గుమాస్తాగా చేరారు. 1973లో డిగ్రీ, 1978లో ఎంఏ, తర్వాత పీహెచ్‌డీ చేశారు. 1966-67 కాలంలో పీయూసీ చదువుతున్నప్పుడు సినారెతో పరిచయం ఏర్పడి, సాహిత్యం వైపు నడిచారు. 1970-79 కాలంలో యువసాహితీ సమితిని స్థాపించి, అనేక సాహిత్య సదస్సులు నిర్వహించారు. తన ఆరో ఏటనే తారాపతి వేషం వేశారు. ఆపై పలు నాటకాల్లో పాత్రలతో మెప్పించారు. 1964లో కళాశాల పత్రిక తరంగిణిలో విధి లిఖితం అనే కథ రాశారు.

సినిమాలకు పాటలు..

లలిత గీతాలపై పరిశోధన చేసిన కృష్ణ డాక్టరేట్ పొందారు. తెలంగాణ వైభవం, తెలంగాణ పుణ్యక్షేత్రాలు, రామప్ప వంటి సంగీత నృత్య రూపకాలను రాష్ట్రమంతటా ప్రదర్శింపజేశారు. నట దర్శకురాలు భానుమతి, అక్కినేని నాగేశ్వరరావు, సినారె ప్రోత్సాహంతో పలు సినిమాలకు పాటలు రాశారు. పెద్దరికం సినిమాలో అన్ని పాటలనూ ఆయనే రాయడం విశేషం. పలు టీవీ సీరియళ్లు, చలన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లో తన ప్రయాణాన్ని సాగిస్తూ పలు డాక్యుమెంటరీలు నిర్మించారు. భక్త కవి పోతన, భారతీయ సంస్కృతి శిఖరాలు ఇప్పటికీ పునఃప్రసారం అవుతున్నాయి. పాట వెలదులు అనే వినూత్న సాహిత్య ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

దేశ విదేశాల్లో సాహిత్య సదస్సులు

దేశ విదేశాల్లో సాహిత్య సదస్సుల్లో పలుమార్లు పాల్గొన్నారు. సుమారు 30 కావ్యాలు, 60కి పైగా ఆడియో ఆల్బమ్స్, 52 రూపకాలు, 60 గజల్ గీతాలు, 90కి పైగా టీవీ ధారావాహికలు, 15 డాక్యుమెంటరీలు, 7 సీరియళ్లు, 200కు పైగా సినీగీతాలు, మరో 200కు పైగా పాట వెలదులు, ముక్తకాలు, కథలు, కథానికలు వెలువరించారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో అప్పటి ఎమ్మెల్యే సీహెచ్.రాజేశ్వరరావు సమక్షంలో సినీనటి జమున చేతులమీదుగా గేయ కిరీటి బిరుదు అందుకున్నారు. నంది పురస్కారాల కమిటీ కమిటీ చైర్మన్‌గా, అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవ న్యాయ నిర్ణేతల కమిటీలో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, ఎన్.జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్.రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రభుత్వ పురస్కారాలు పొందారు.

మాజీ మంత్రి కేటీఆర్ సంతాపం

వడ్డేపెల్లి కృష్ణ మృతికి మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంతాపం వెలిబుచ్చారు. అనేక సాహితీ ప్రక్రియల్లో రాణించిన ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. సాహిత్య రంగానికి మరింత సేవ చేయాలన్న తపన కలిగిన కృష్ణ మరణం తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా రచయితల నివాళి

రాజన్నసిరిసిల్ల జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి ప్రతినిధులు, రచయితలు సిరిసిల్ల గాంధీ సర్కిల్‌లో వడ్డేపల్లి కృష్ణ చిత్రపటానికి నివాళి అర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, డాక్టర్ వాసరవేని పర్శరాం, జనపాల శంకరయ్య, కోడం నారాయణ, బూర దేవానందం, కొక్కుల రాజేశం, వెంగల లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్, గుండెల్లి వంశీ తదితరులున్నారు.



చనిపోతే.. చావే

బురద రోడ్డుపై ఇబ్బంది పడుతూ మృతదేహాన్ని తరలిస్తున్న బంధువులు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: పై ఫొటో ఎక్కడో ఏజెన్సీ ప్రాంతంలోనిది అనుకుంటే పొరపాటే. ఇది ముమ్మాటికీ ఆరుసార్లు స్వచ్ఛతలో జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన సిరిసిల్ల మున్సిపల్ పరిధి ఒకటో వార్డు రగుడులోనిది. ఇక్కడ ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించేవారికి చావే అవుతోంది. గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిలో వానాకాలం పలుచోట్ల ఇలా బురద రోడ్డు దాటాల్సి ఉంటుంది. రగుడుకు చెందిన కాసర్ల శ్రీనివాస్(45) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించేందుకు అతని మృతదేహాన్ని తీసుకెళ్తూ బురద రోడ్డుపై నానాతంటాలు పడ్డారు. రోడ్డుకు మరమ్మతు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


విద్యాశాఖ అధికారులకు హైకోర్టు నోటీసులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనిలోని రావూస్ పాఠశాలను మూసివేయాలన్న ఆదేశాలను బేఖాతరు చేశారంటూ హైకోర్టు విద్యాశాఖ అధికారులు రీజినల్ జాయింట్ డైరెక్టర్, పెద్దపల్లి డీఈవో, రామగుండం ఎంఈవోలకు నోటీసులు జారీ చేసినట్లు వ్యాపారి కోట కుమార్ తెలిపారు. గతంలో రావూస్ పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని తాను హైకోర్టును ఆశ్రయించానన్నారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఆ పాఠశాలను మూసివేయాలని ఆదేశాలిచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. తర్వాత వారిపై కంటెంప్ట్ కేసు ఫైల్ చేయగా శుక్రవారం హైకోర్టు జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఎదుట అడ్వకేట్ పవన్ చక్రవర్తి వాదనలు వినిపించారని తెలిపారు. అనంతరం విద్యాధికారులకు నోటీసులు జారీ చేసి, రెండు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని జడ్జి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల కల్చరల్: బాలికపై లైంగికదాడికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత తీర్పునిచ్చారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ప్రకారం.. 2018 డిసెంబర్ 25న ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో స్థానికుడైన చీపెల్లి మల్లయ్య ఆమె వద్దకు వచ్చాడు. బిస్కెట్లు ఆశ చూపి, మాయ మాటలు చెప్పి, తన ఇంటికి తీసుకెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయాన్ని బాధితురాలు మరుసటి రోజు తల్లికి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట పోలీసులు మల్లయ్యపై పోక్సో కేసు నమోదు చేశారు. అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ శ్రీనివాస్ వాదించగా సీఎంఎస్ ఎస్సై రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో 12 మంది సాక్షులను విచారించారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించి, మల్లయ్యకు శుక్రవారం శిక్ష ఖరారు చేశారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎంలు పద్మజ, రత్నాకర్

రామడుగు(చొప్పదండి): రామడుగు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-15 సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను హైస్కూల్ హెచ్‌ఎం పద్మజ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి ప్రారంభించారు. పలు పాఠశాలలకు చెందిన 250 మంది క్రీడాకారులు హాజరయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టును ఈ నెల 14, 15వ తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ స్వరూపారాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, పీఈటీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని డీడీనగర్ కాలనీకి చెందిన నలివేని ఎల్లమ్మ(43) ఈ నెల 2న పనిమీద ఇంటి నుంచి బయటకు వచ్చింది. స్థానిక ఓ గార్డెన్స్‌కు వరకు వెళ్లి, అక్కడ రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ బాలయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కారు టైర్లు చోరీ

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తులు కారు టైర్లను చోరీ చేసిన ఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రవి వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణ బస్టాండ్‌లోని కార్గో కార్యాలయానికి ఈ నెల 4న హుజూరాబాద్ నుంచి నాలుగు కొత్త కారు టైర్లు వచ్చాయి. వాటిని కార్యాలయం ఎదుట ఉంచగా అదేరోజు దుండగులు ఎత్తుకెళ్లారు. ఆ టైర్ల విలువ రూ.34,400 అని కార్గో నిర్వాహకుడు రమేశ్ తెలిపారు. రెండు రోజులుగా చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రాయికల్(జగిత్యాల): ఉప్పుమడుగులో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన షేక్ అల్మాస్, షేక్ హైదర్‌లు బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకున్నామని అన్నారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డెంగీ లక్షణాలతో మహిళ..

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చలిగంటి లక్ష్మి(50) డెంగీ లక్షణాలతో మృతిచెందింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి జ్వరంతో బాధ పడుతూ నాలుగు రోజుల క్రితం స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు శుక్రవారం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దవాఖానాలో చేర్పించిన వెంటనే ఆమె చనిపోయింది.

రేపు ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. హాజరవ్వాలనుకునే క్రీడాకారుల ఇండెక్స్ మొత్తం 215 పాయింట్లు దాటరాదని తెలిపారు.

అదుపుతప్పి ట్రాలీ ఆటో బోల్తా

- డ్రైవర్‌తోపాటు ఏడుగురు వ్యవసాయ కూలీలకు తీవ్ర గాయాలు
- బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

ఓదెల(పెద్దపల్లి): ట్రాలీ ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌తోపాటు ఏడుగురు వ్యవసాయ కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఓదెలకు చెందిన వ్యవసాయ మహిళా కూలీలు శుక్రవారం స్థానికుడైన లగిశెట్టి శ్రీనివాస్ ట్రాలీ ఆటోలో మడక గ్రామానికి వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకొని, అదే వాహనంలో ఓదెలకు వస్తున్నారు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చేయి విరగగా, బోడకుంట అనిత, బుద్దె శ్రీలత, బుద్దె అనూష, బోడకుంట సమ్మక్క, గటికె శంకరమ్మ, లక్ష్మి, రాజమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీప రైతులు వచ్చి, వారిని బయటకు తీశారు. బాధితుల్లో అనిత, శ్రీలత పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని గుంపులకు చెందిన మలగల సదానందం అలియాస్ ఆరెపల్లి సదయ్య, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి మల్లన్నపల్లికి చెందిన బండారి యాదగిరిలకు విద్యుత్ చౌర్యం కేసులో న్యాయమూర్తులు జరిమానా విధించారని విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.షాదుల్లా బాబా తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సదానందం, యాదగిరిలు తమ ఇళ్లకు విద్యుత్ శాఖ అనుమతి లేకుండా కరెంట్ వాడుతుండగా సంబంధిత అధికారులు పట్టుకొని, విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మొదటి నేరంగా భావించి, కేసు నమోదు చేసి, రూ.500 చొప్పున జరిమానా విధించి, వదిలేశారు. కానీ, ఆ ఇద్దరూ మళ్లీ విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి, ఆయా జిల్లాల న్యాయస్థానాల్లో హాజరుపర్చారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో సదానందం రూ.15,169 జరిమానా చెల్లించాలని లేదంటే మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.హేమంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే, యాదగిరి రూ.4,371 జరిమానా చెల్లించాలని లేదంటే ఒక నెల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని కరీంనగర్ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి డి.వెంకటేశ్ తీర్పు వెల్లడించారు.

వరద కాలువలో వ్యక్తి మృతదేహం

గంగాధర(చొప్పదండి): మండలంలోని ర్యాలపల్లి శివారు వరద కాలువలో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చింది. లోపల పైపులకు తట్టుకోవడంతో శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులకు కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డుపై బొట్ల శ్రీనివాస్ అని ఉన్నట్లు పేర్కొన్నారు. అతని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొన్నట్లు తెలిపారు.

జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీ

పెద్దపల్లిరూరల్: జిల్లావ్యాప్తంగా పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ధర్మారం తహసీల్దార్ రజిత పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయానికి, కమాన్‌పూర్ తహసీల్దార్ అరీఫొద్దీన్ ధర్మారం తహసీల్దార్‌గా, జూలపల్లి తహసీల్దార్ బషీరుద్దీన్ ఎలిగేడ్ తహసీల్దార్‌గా, ఎలిగేడ్ తహసీల్దార్ స్వర్ణ జూలపల్లి తహసీల్దార్‌గా, పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాసంతి కమాన్పూర్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

'అల్ఫోర్స్'లో గణేశ్ ఉత్సవాలు


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో వినాయక చవితిని పురస్కరించుకొని శుక్రవారం గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడు మహిమాన్వితుడని, సకల శుభాలను కలిగిస్తాడని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. విద్యార్థులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో వచ్చి, సందడి చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

కరీంనగర్ భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. స్థానికులు ఆయనను శాలువాతో సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి


బాబు (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): చేపల వేటకు వెళ్లి, గల్లంతైన ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏఎస్సై సత్తయ్య కథనం ప్రకారం.. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లికి చెందిన గన్నెబోయిన బాబు(52) గత మంగళవారం రాత్రి స్థానిక చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతూ నీటిలో గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా శుక్రవారం చెరువు మత్తడికి కొద్ది దూరంలో అతని మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

లోన్ తీర్చలేక యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నల్లగొండకు చెందిన నర్రెంకుల నరేశ్(35) ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నరేశ్ హిందుస్తాన్ మైక్రో ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5 లక్షలు హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. తర్వాత ఆ రుణాన్ని తీర్చలేకపోయాడు. దీంతో ఫైనాన్స్ సంస్థ నుంచి ఒత్తిడి పెరిగింది. మనస్తాపానికి గురైన నరేశ్ శుక్రవారం తెల్లవారుజామున గ్రామ ప్రభుత్వ నర్సరీలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఉదయం గుర్తించిన స్థానికులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.